క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి మహిళ మృతి


మృతి చెందిన హేమలత

రాజమహేంద్రవరం సిటీ: సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో రాజమహేంద్రవరం నుంచి గుంటూరు వెళ్తున్న మాగంటి హేమలత (40) రైలు నుంచి జారి పడటంతో తీవ్ర గాయాల పాలైంది. గోదావరి రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జీఆర్పీ కానిస్టేబుల్ రాధాకృష్ణ ఈ విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకుని ఆమెను వైద్య సేవల నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్య సేవలు నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందని జీఆర్పీ ఎస్‌ఐ లోవరాజు తెలిపారు.

శాంతి భద్రతలపై ఆరా

కడియం: తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్‌బీఎం మురళీకృష్ణ బుధవారం కడియం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సాధారణ పర్యటనలో భాగంగా వచ్చిన ఆయన స్టేషన్ పరిధిలోని వివిధ కేసులు, శాంతిభద్రతలపై ఆరా తీశారు. అనంతరం స్థానికంగా ఉన్న నర్సరీని సందర్శించారు. ఆయన వెంట కడియం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

స్ఫూర్తిప్రదాత వాజ్‌పేయి


నగరంలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కడియం: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి స్ఫూర్తి ప్రదాత అని పలువురు పేర్కొన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని కడియంలో వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ నాయకులు పుష్పాంజలి ఘటించారు. ప్రధానిగా ఆయన చేపట్టిన పలు కార్యక్రమాలు దేశాభివృద్ధికి ఎంత కీలకమయ్యాయో గుర్తు చేసుకున్నారు. నాయకులు నాగులాపల్లి వీరబాబు, కొటికలపూడి వెంకటేశ్వరరావు, బొరుసు సుబ్రహ్మణ్యం, గుత్తుల హరిప్రసాద్, చిక్కాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ప్రధాని వాజ్‌పేయి దేశాభివృద్ధికి అనేక బాటలు వేశారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి అన్నారు. నగరంలో మల్లిడి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వాజ్‌పేయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా అభివృద్ధికి డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల రామకృష్ణారావు, అసెంబ్లీ కన్వీనర్ ఎనుముల రంగారావు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీని మరింత బలోపేతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా బీజేపీ కార్యాలయంలో విశాఖ డెయిరీ అధినేత ఆడారి ఆనంద్‌కు బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలకు బీజేపీ శ్రీకారం చుట్టిందన్నారు.


ఖాళీ ప్రదేశంలో ఆకుకూరల మొక్కలు


సొంతంగా తయారు చేసుకున్న సేంద్రియ ఎరువులతో పండించిన మొక్కలు

పెరటి మొక్క... ఎంచక్కా

- సేంద్రియ సాగుతో ఆరోగ్యం
- కూరగాయల వ్యర్థాలతో ఎరువుల తయారీ
- ఇంట్లోనే సాగు చేస్తున్న మహిళలు

సీటీఆర్‌ఐ: మనం తినే ఆహారం విషతుల్యంగా మారింది.. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగమే అందుకు కారణం.. ఈ నేపథ్యంలో సేంద్రియ సాగుకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చే కూరగాయలన్నీ రసాయన ఎరువులతోనే పండిస్తున్నారు. దానివల్ల వాటిలో నాణ్యత కొరవడడంతో పాటు ఆరోగ్యానికి హాని జరుగుతోంది. ఈ నేపథ్యంలో చాలామంది తమ ఇళ్లు, పెరట్లో కూరగాయల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. వివిధ మొక్కలు, పాదులు పెట్టి వాటిని చాలా శ్రద్ధగా పెంచుతున్నారు. అయితే వాటిని ఎంత జాగ్రత్తగా పెంచినా ఎరువులు వేయకుంటే పోషకాలు సక్రమంగా అందవు. దీంతో సేంద్రియ ఎరువు తయారీకి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. రోజూ ఇంట్లో ఉపయోగించే కూరగాయల వ్యర్థాలతో మంచి ఎరువు తయారు చేసేలా మహిళలకు శిక్షణ ఇచ్చింది. దీనివల్ల మొక్కలు పెంచడానికి అవసరమైన ఎరువును ఎవరికి వారే ఇళ్లలో తయారు చేసుకుంటున్నారు. అందుకే పెట్టుబడి లేని ఆదాయం కోసం మహిళలు ఇప్పుడు ఇంటి ఆవరణలోనే గార్డెనింగ్ ద్వారా కూరగాయలు, ఆకు కూరలు పండించి వాటిని సొంతానికి వాడుకుంటూ, ఇతరులకూ విక్రయిస్తున్నారు. కూరగాయలు పండించడానికి సేంద్రియ ఎరువులు అవసరమవుతాయి. వీటిని కొనుగోలు చేయడానికి కొంత సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తుంది. దీనికోసం కార్పొరేషన్ వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇంట్లో వ్యర్థ పదార్థాల ద్వారా ఖర్చు లేకుండా సేంద్రియ ఎరువులు తయారు చేసుకోనే విధంగా మహిళలకు శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. శిక్షణ పొందిన మహిళలు ఇంట్లోనే హోం కంపోస్టును తయారు చేసుకుంటున్నారు.

కూరగాయల పెంపకం.. ఆదాయం

ప్రతి ఒక్కరూ ఇప్పుడు మొక్కల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంట్లో ఏ మాత్రం ఖాళీ ప్రదేశం కనిపించినా అక్కడ మొక్కలు నాటుతున్నారు. అంతేకాకుండా గార్డెనింగ్‌లోనూ, డాబాపై పూల మొక్కలు, కూరగాయలు వంటివి సొంతంగా పండించుకుంటున్నారు. మహిళలు సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను వారే స్వయంగా విక్రయిస్తున్నారు.

తయారీ విధానం

కూరగాయల వ్యర్థాలు, మిగిలిన అన్నం, తడి చెత్తను ఒక కుండలో కాని, డబ్బాలో వేసుకోవాలి. కుండ/ డబ్బాకు అడుగున ఒక రంధ్రం చేయాలి. దీనిద్వారా చెత్తలోని తేమ బయటకు పోతుంది.


సేంద్రియ ఎరువు తయారీలో శిక్షణ ఇస్తున్న సిబ్బంది

ఇలా రోజూ ఇంట్లో మిగిలిన తడి చెత్తను ఆ కుండ/ డబ్బాలో వేసుకోవాలి. కుండ, డబ్బా చుట్టూ కారం, పసుపు చల్లాలి. దీనివల్ల చీమలు పట్టకుండా ఉంటాయి. ఒక నెల రోజులోనే కంపోస్ట్ తయారవుతుంది. ఎవరికి వారే ఎరువు తయారు చేసుకునే విధంగా నగర పరిధిలోని సుమారు 5 వేల కుటుంబాలను ఎంపిక చేశారు. ఈ తయారీ విధానంలో వారికి శిక్షణ ఇచ్చారు. దీనితో సేంద్రియ ఎరువును తయారు చేసుకుని దానిని వారి సొంతానికి వాడుకుంటున్నారు.

మంచి దిగుబడి

సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని వాటిని పెరటి మొక్కలకు వాడటం వల్ల మంచి దిగుబడి వస్తుంది. మహిళలు తమ ఇంట్లో తయారు చేసుకున్న సేంద్రియ ఎరువులను పెరట్లో పెంచుతున్న మొక్కలకు వాడుతున్నారు. దీనివల్ల దిగుబడి పెరుగుతుంది. ఇంట్లో పెంచుకుంటే కూరగాయలను బయట అధిక ధరలకు కొనాల్సిన పని ఉండదు. తయారీ చేసుకొనే విధానం చాలా సులువుగా ఉండటంతో మహిళలు పెద్ద శ్రమ లేకుండా తయారు చేసుకోవచ్చు.

– శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్, కార్పొరేషన్

పరశురామ అవతారంలో జనార్దనుడు


ప్రత్యేక అలంకరణలో జనార్దనస్వామి

ధవళేశ్వరం: ధనుర్మాసం సందర్భంగా ధవళేశ్వరం గ్రామంలోని వేంచేసియున్న శ్రీలక్ష్మీజనార్దన స్వామి బుధవారం పరశురామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఎస్‌వీఎస్‌ఎన్ ఆచార్యులు (కాసులు), పవన్‌కుమార్ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

గుర్తుకొచ్చిన మధుర జ్ఞాపకాలు

రంగంపేట: వారంతా ఎన్నో ఏళ్ల క్రితం కలిసి చదువులు సాగించారు. చదువులు పూర్తయిన తర్వాత ఉన్నత చదువుల కోసం ఎవరి మార్గంలో వారు వెళ్లిపోయారు. అనంతరం వృత్తి, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. దాదాపు 40 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న 1981–82 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం ఓ చోట చేరి సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలలో మునిగితేలారు. ఇదే పాఠశాల పూర్వ విద్యార్థి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు సమావేశానికి హాజరయ్యారు. స్నేహం మనుషుల మధ్య ఆత్మీయతను పెంచుతుందన్నారు. స్నేహం విలువ తెలుసుకొని ప్రేమాభిమానాలతో గడపడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సరస్వతీ మాత, గణేష్ విగ్రహాలకు పూల మాలలు వేసి పూజలు చేశారు. అనంతరం అకాల మరణం చెందిన చెందిన పూర్వ విద్యార్థులను స్మరించుకుంటూ మౌనం పాటించి నివాళులు అర్పించారు. సహపంక్తి భోజనాలు చేశారు.

సాహితీ వేదిక వార్షిక సమావేశం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేదిక సభ్యులు

సీటీఆర్‌ఐ: స్థానిక శ్రీగౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో బుధవారం రాజమహేంద్రి సాహితీ వేదిక సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. డాక్టర్ అరిపిరాల నారాయణరావు కృత అంత్యానుప్రాస నిఘంటువు (ద్వితీయ ముద్రణ)ను మల్లాప్రగడ రామారావు ఆవిష్కరించగా, జంధ్యాల శరత్‌బాబు సమీక్షించారు. భాస్కరం రచించిన 'బహురూపులవాడు' (ట్రాయ్‌లో తవ్వకాలు జరిపిన తొలితరం ఆర్కియాలజిస్ట్ 'హైన్రిస్ ష్లీమన్' జీవిత గాథ) పుస్తకాన్ని కల్లూరి వెంకట రమణ ఆవిష్కరించగా, కల్లూరి భాస్కరం పుస్తక పరిచయం చేశారు. సాహితీ వేదిక సభ్యుల కవితల సంకలనం 'మళ్లీ నది ఒడ్డున' (ద్వితీయ ముద్రణ)ను డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు ఆవిష్కరించగా, డాక్టర్ చిలుకూరి కూర్మయ్య సమీక్షించారు. 'వర్తమాన తెలుగుకథ'పై జి.వెంకటకృష్ణ ప్రసంగించారు. సాహితీ వేదిక సభ్యులు సీహెచ్ శకుంతలాదేవి, విశ్వనాథం, సాధానాల వెంకటస్వామి నాయుడు, నల్లగొండ రవిప్రకాష్, ఎంఎస్ సూర్యనారాయణ, సత్యభాస్కర్, జోరా శర్మ, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలో వేదిక దొరకలేదా?

- ఖరీదైన హోటల్‌లో సహిత విద్య శిక్షణ
- ఖజానాకు గండి కొడుతున్న అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రజలు పన్నుల ద్వారా చెల్లించే సొమ్మును ఖర్చు చేసే విషయంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి. అయితే నా సొమ్మేం పోయిందిలే ఇది ప్రభుత్వానిదే కదా అన్నట్టు కొందరు అధికారులు వ్యవరిస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఒక ఖరీదైన హోటల్‌లో జిల్లా సమగ్ర శిక్షా అధికారులు మంగళవారం నిర్వహించిన సహిత విద్య శిక్షణ కార్యక్రమం దీనికి అద్దం పడుతోంది. రాజమహేంద్రవరం కేంద్రంగా జిల్లా విద్యా కార్యక్రమాలు ఎప్పుడు జరిగినా డీఈఓ కార్యాలయం, డీఐ కార్యాలయం, ప్రభుత్వ ఎస్‌కేవీటీ హైస్కూల్‌లోని హాలులో నిర్వహిస్తారు. సమావేశం జరిగే చోటుకు 8 కిలోమీటర్లకు పైబడి దూరం నుంచి వచ్చేవారికి టీఏ, డీఏలు ఇస్తారు. ఈలోపు పరిధి అయితే డీఏ మాత్రమే ఇస్తారు. అయితే హోటల్‌లో జరిగిన సహిత విద్య శిక్షణకు 38 మంది ఎంఈవోలు, భవిత సెంటర్ సిబ్బంది సుమారు 30 మంది వరకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు అక్కడే చేశారు. ఆ హోటల్‌లో వెజ్ భోజనం ఒక్కింటికి రూ.500, నాన్ వెజ్ భోజనం రూ.650 వసూలు చేస్తారు. దాని వల్లే విందు ఖర్చు ఎక్కువైంది. శిక్షణ కార్యక్రమానికి నగరంలోని ఏ విద్యా సంస్థలోనూ వేదిక దొరకలేదా అని అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు.



సహిత విద్య శిక్షణలో మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి (ఫైల్)

ఎంఈఓ స్థాయి అధికారులు కాబట్టే..

సహిత ఒకరోజు శిక్షణను ముందుగా దానవాయిపేట ధర్మంచర కమ్యూనిటీ హాలులో నిర్వహించాలని అనుకున్నాం. అనివార్య కారణాల వల్ల హోటల్‌కు మార్చాల్సి వచ్చింది. ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వం రూ.50 వేల బడ్జెట్ ఇచ్చింది. ఎంఈవో స్థాయి అధికారులు వస్తున్నారు కనుక మంచి సౌకర్యవంతంగా శిక్షణ జరగాలని ఆ హోటల్‌లో పెట్టాం.

– ఎస్.కనకబాబు, సమగ్ర శిక్షా జిల్లా కో–ఆర్డినేటర్

మనుస్మృతి ప్రతుల దహనం

సీటీఆర్‌ఐ: కుల వివక్షకు, అసమానతలకు కారణమైన మనుస్మృతి ప్రతులను బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం దహనం చేశారు. తొలుత స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. బహుజన సమాజ్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఇసుకపట్ల రాంబాబు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరావు, పట్నాల విజయకుమార్, జిల్లా ఇన్‌చార్జ్ పరమాట గణేశ్వర రావు, బద్దె జార్జ్ అంథోని, కూర్మారావు, కొనాల లాజర్, నక్కా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.


మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న సంఘ నాయకులు

సినిమాలు



శ్యామల	: విడుదల–2
సూర్యమినీ	: ముఫాసా
సూర్యప్యాలెస్	: యుఐ
స్వామి	: ముఫాసా
శివజ్యోతి	: పుష్ప–2
అనుశ్రీ	: శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్
రాజా	: పుష్ప–2
ఊర్వశి	: పుష్ప–2, బరోజా
మేనక	: బేబీ జాన్
రంభ	: ముఫాసా
కుమారి	: ముఫాసా
అప్సర	: పుష్ప–2
అశోక నామవరం	: బచ్చలమల్లి
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: పుష్ప–2
మురళీకృష్ణ కడియం	: పుష్ప–2
వెంకటసూర్య	: ముఫాసా, పుష్ప–2

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

సీటీఆర్‌ఐ: రాజమహేంద్రవరం నగరం, రూరల్ నియోజకవర్గాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. చర్చిలన్నీ విద్యుత్ కాంతులతో ధగధగ మెరిసిపోయాయి. నగరంలోని హోటల్ ఆనంద్ రీజెన్సీ వద్ద బైబిల్ మిషన్ చర్చి, లాలాచెరువు వద్ద మరనాత చర్చి, హోసన్నా చర్చి, క్వారీ సెంటర్ వద్ద క్రీస్ట్ వర్షిప్ సెంటర్, బుచ్చయ్య నగర్‌లోని రాక్ చర్చి, దహించు అగ్ని, లూథరిగిరి చర్చి, బ్రదరన్ చర్చి, క్రీస్తు సంఘం, సీయోను ప్రార్థనా మందిరంలో జరిగిన వేడుకల్లో బిషప్‌లు, పాస్టర్లు ప్రార్థన చేసి క్రీస్తు బోధనలను వివరించారు. శాంతి, సంతోషాలకు చిహ్నం క్రిస్మస్ అని, నిన్ను వలే నీ పొరుగువారిని ప్రేమించండి అని చెప్పిన బోధనలు అందరూ ఆచరించాలన్నారు. నగరంలోని పలు క్రైస్తవ మందిరాలను మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ సందర్శించి, క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీ భరత్‌ను ఆయా చర్చిల నిర్వాహకులు, పెద్దలు, పాస్టర్లు ఘనంగా సత్కరించి, ఆశీస్సులు అందజేశారు. అలాగే రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పలు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ వేడుకల్లో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొని పాస్టర్ల ఆశీస్సులు పొందారు.

ధవళేశ్వరం: స్థానిక ఎస్‌ఎంఈ చర్చిలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. క్రీస్తు చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు గునిపె అశోక్, రేగుళ్ల రాజు తదితరులు ఉన్నారు.


రాజమహేంద్రవరం సెయింట్ పాల్ లూథరన్ చర్చ్‌లో కొవ్వొత్తులతో ఆరాధన


ధవళేశ్వరం ఎస్‌ఎంఈ చర్చిలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు


బొమ్మూరు క్రైస్ట్ లూథరన్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న సంఘ కాపరి అబ్షాలోమ్

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొమ్మూరులోని క్రైస్ట్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో సంఘ కాపరి రెవ.కె.అబ్షాలోమ్ క్రీస్తు జనన ప్రాముఖ్యతను వివరించారు. సంఘ పీసీసీ సభ్యులు, స్త్రీల సమాజం సభ్యులు, యూత్, సండే స్కూల్ చిన్నారులు పాల్గొని వేడుకలు జరుపుకొన్నారు.

అలాగే ఐఎల్‌టీడీలోని ఎపిఫానియా పారిస్ చర్చి, గ్లోరియో డే లూథరన్ చర్చి, ఆర్‌సీఎం చర్చిలతో పాటు పలుచోట్ల క్రిస్మస్ సంబరాలు జరిగాయి.

కడియం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించా. బుధవారం రాత్రి ప్రారంభమైన ఈ ప్రార్థనల్లో విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కడియంతో పాటు, వేమగిరి, కడియపులంక, దుళ్ల, జేగురుపాడు, వీరవరం, మురమండ, మాధవరాయుడుపాలెం తదితర గ్రామాల్లోని పలు చర్చిల్లో క్రీస్తు జననం, జీవనం, మానవాళికి అందించిన శుభవాక్యం తదితర అంశాలను దైవజనులు వివరించారు. క్రీస్తు పుట్టుకను తెలియజేస్తూ భారీ స్టార్స్‌ను ఏర్పాటు చేశారు. కేండిల్ సర్వీస్, కేక్‌కటింగ్స్ జరిగాయి.


దేవదూతల అలంకరణలో చిన్నారులు



మాజీ ఎంపీ భరత్‌ను సత్కరిస్తున్న క్రైస్తవులు



క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్‌లో మాట్లాడుతున్న షర్మిలారెడ్డి